# ఇంటాయన

ఉమ, వాణి హైమావతి ఒకే ఆఫీసులో ఉద్యోగస్థులు. రోజూ కలిసి లంచ్ చేస్తారు. ఆ లంచ్ టైములో ఏదో సాహితీ చర్చ జరుగుతూనే ఉంటుంది. ఒకరోజు పత్రికలో వచ్చిన నవల గురించి ప్రస్తావన వచ్చింది. వాణి ఆ నవల్ని చాలా విమర్శించింది. ఉమ ఆ నవల్లోని విషయాల్ని సమర్థించింది. పైగా 'ఆ నవల్లో విషయ పసలేనిదే దానికి బహుమతి ఎందుక వస్తుందే! ఆ పత్రిక వాళ్లు వెర్రివాళ్లంటావా!' అని నిలదీసింది వాణిని, ఉమ.

వాణి కొంచెం ఉడుక్కుంది. "ఏమిటో! ఇదంతా చూస్తే ఆ నవలా రచయిత దీని చుట్టమేమో" అంది హైమావతితో.

"అవునే ఖచ్చితంగానూ! చుట్టం కంటే ఎక్కువే! ఆ నవలా రచయిత మా ఇంటాయన" అంది ఉమ.

"అలా చెప్పు. ఏదైనా పుస్తకాన్ని దాని యొక్క బాగోగుల్ని బట్టి మెచ్చుకోవాలేగాని 'ఇంటాయన' అయితే ఒకలాగా మేనత్త అయితే ఒకలాగా, ఇంకెవరైనా అయితే ఇంకోలాగా సమర్థించుకోకూడదు" అంది వాణి.

"సర్లే ఆ విషయం మాకు తెలీదులే" అంది ఉమ.

ఇదేదో చినికి, చినికి, గాలివానయ్యేటట్లుందని, "లంచ్ అవర్ అయిపోయింది, ఇక నడవండే" అంది, హైమావతి.

ఆ మర్నాడు లంచ్ అవర్లో ఆ నవల విషయం మళ్లీ మొదలు పెట్టింది వాణి. వాణికి కొంచెం ఉక్రోషం ఎక్కువ. "నేను రేపు ఆదివారం వచ్చి ఆనవలలోని విషయాలు ముఖాముఖీ, మీ ఇంటాయనతో చర్చించి నేను చెప్పినవి సమంజసంగా ఉన్నాయని ఆయనచేత చెప్పించకపోతే నా పేరు వాణి కాదు" అంటూ "నువ్వు కూడా నాతోపాటు రావే" అంది హైమావతితో.

"సరే రండి నాకేం భయంలేదు" అంది ఉమ.

అనుకున్నట్లుగానే ఆదివారం హైమావతి, వాణీ కలసి పది కిలోమీటర్లు బస్సులో పడి ఉమ ఇంటికి వెళ్ళారు. ఇదే మొదటిసారి ఉమ ఇంటికి వెళ్ళడం!

ఎంత స్నేహితులైనా హైదరాబాద్‌లో ఒకళ్లింటికి ఒకళ్లు వెళ్ళడం కష్టమే!. అందులోనూ ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకి!. వచ్చేది ఒక్క ఆదివారం. ఆ రోజు సెలవైనా పొద్దుట్నుంచీ సాయంకాలం వరకు ఇల్లు సర్దుకోవడం, పిల్లల చదువుల విషయంప్రత్యేకంగా చూసుకోవడంతో సరిపోతుంది. ఉమ ఇల్లు పట్టుకోవడం కష్టం అయింది. తీరా వెళ్లేసరికి ఉమ ఇల్లు తాళం వేసుంది. వాణి మెల్లగా అంది "నేను చెప్పలేదే హైమా! భయపడి ఎక్కడికైనా ఇల్లు తాళం వేసుకుని వెళ్లిపోతుందేమో అని! అలాగే అయింది చూడు".

ఆ పక్క వాటాలో ఆవిడ్ని అడిగారు "ఉమ ఎప్పుడు వస్తుందని".

"వాళ్ల మేనమామగారికి బాగా లేదని కబురొస్తే వెళ్లిందండి. బహుశా సాయంకాలం దాకా రారేమో! పూర్తి వివరాలు కావాలంటే పైన ఓనర్స్‌ని అడిగితే తెలుస్తుంది" అని లోపలికి పిలిచి, మంచి నీళ్లూ, కాఫీ ఇచ్చి "ఏదైనా ముఖ్యమైన పనయితే చెప్పండి. నా వల్లవుతుందేమో చూస్తానంది" ఆవిడ.

ఈ నవల గోల ఏం చెప్తారు పాపం! "రేపు ఆఫీసులో ఎలాగూ కలుస్తాం" అని వెళ్ళిపోయారు వాళ్లు.

ఆ మర్నాడు ఆఫీసులో ఉమని గట్టిగా తగులకుంది, వాణి. "అంత దూరం వస్తే, నీ ఇంటికి తాళం వేసుకుపోయావు. అంత భయం అయితే ఆ నవల గురించి నేను చెప్పిన విషయాలు ఒప్పేసుకోవచ్చుకదా! కనీసం నీ భర్తని యింట్లో అట్టేపెట్టినా, ఆ నవల గురించి మాట్లాడేదాన్ని కదా!"

"అనుకోకుండా మా మామయ్యకి బాగా లేకపోతే వెళ్లాను. అయినా నా భర్తతో మాట్లాడటం ఏమిటి! మా ఇంటాయన, అదే ఆ నవలా రచయిత మా యింటి ఓనర్, ముసలాయన మేడ మీదే ఉన్నారుకదా! ఆయనతో మాట్లాడవలసింది" అంది ఉమ.

"అయితే ఆ నవలా రచయిత నీ భర్తకాదన్నమాట! మరి మా ఇంటాయన... ఇంటాయన అని చచ్చావేం" అంది వాణి. హైమావతి కూడి వెర్రిమొహం వేసింది.

(చతుర, అక్టోబర్ 2004)